# నవతరం

తెలుగు దినపత్రిక

పబ్లిషింగ్ : రాజమహేంద్రవరం | సంపుటి : 12 | సంచిక : 05 | RNI NO:APTEL/2018/76747 | బుధవారం 25 - 02 - 2026 | పేజీలు : 04 | వెల : 01 రూ..

Published From: Srikakulam, Parvathipuram Manyam,Vizianagaram,Visakhapatnam,Alluri Sitharama Raju,Anakapalli,Kakinada,East Godavari ,Konaseema,Eluru,West Godavari,NTR,Krishna,Guntur,Bapatla,Nellore,Prakasam,Kurnool,Nandyal,Sri Sathya Sai,YSR,Annamayya,Tirupati,Chittoor


## కొత్త జిల్లాలో తొలిసారిగా

**ఈరోజు మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన**

- మార్కాపురం జిల్లాలో బుధవారం పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- కొత్త జిల్లాగా ఏర్పాటయ్యాక ముఖ్యమంత్రి తొలి పర్యటన ఇదే
- రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన
- గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టు పనుల ప్రారంభం
- మార్కాపురం పట్టణంలో ప్రజావేదిక సభలో పాల్గొననున్న సీఎం

ఆంధ్రప్రదేశ్, నవతరం

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పర్యటించనున్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు తర్వాత ఇదే ఆయన తొలి పర్యటన కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో భాగంగా, పశ్చిమ ప్రకాశం ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు అసంపూర్తి పనులను పూర్తి చేసే దిశగా కీలక ముందడుగు వేయనున్నారు. రూ.456 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఫీడర్ కెనాల్ పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాల ప్రకారం, బుధవారం ఉదయం అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం

మిగతా 2 లో



## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ

**మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగుబాటు**

- లొంగిపోయిన వారిలో పొలిట్‌బ్యూరో, సెంట్రల్ కమిటీ సభ్యులు
- మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్మూలమైందని పోలీసుల ప్రకటన
- ఆరోగ్య సమస్యలతో లొంగిపోయినా, రాజకీయ జీవితం కొనసాగిస్తానని చెప్పిన దేవ్ జీ
- లొంగిపోయిన నేతలకు రూ.25 లక్షలు, రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వ పునరావాసం

తెలంగాణ, నవతరం

తెలంగాణలో నక్సల్ ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన ఇద్దరు అగ్రశ్రేణి నాయకులతో సహా మొత్తం నలుగురు కీలక నేతలు మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ తాత్కాలిక కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి (దేవ్ జీ), కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు (దామోదర్), రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నరసింహారెడ్డి (గంగన్న) హైదరాబాద్‌లో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. ఈ లొంగుబాటుతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్మూలించబడినట్లేనని పోలీసులు ప్రకటించారు. లొంగిపోయిన నేతలు దశాబ్దాలుగా అజ్ఞాతంలో కొనసాగుతూ పార్టీలో అత్యున్నత స్థాయి బాధ్యతలు నిర్వర్తించారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో ఉన్న దేవ్ జీ,

మిగతా 2 లో




## బొత్స వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

- శాసనమండలిలో సోము వీర్రాజుపై బొత్స సత్యనారాయణ వ్యక్తిగత వ్యాఖ్యలు
- బొత్స వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డ మంత్రి నారా లోకేశ్
- ఆ వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించాలని ఛైర్మన్‌ను కోరిన వైనం
- వాకౌట్ చేయడం బొత్సకు ఫ్యాషన్ గానే కాకుండా, ప్యాషన్‌గానూ మారిందంటూ విమర్శ



2

ఆంధ్రప్రదేశ్, నవతరం

శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజును ఉద్దేశించి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలు వ్యక్తిగత దాడి

## హెరిటేజ్‌పై ఆరోపణలు

- కల్తీ నెయ్యి వ్యవహారంలో హెరిటేజ్‌పై ఆరోపణలను తీవ్రంగా ఖండించిన సీఎం చంద్రబాబు........
- అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవాల వెల్లడి
- హెరిటేజ్ ప్రభుత్వానికి ఎలాంటి ఉత్పత్తులు సరఫరా చేయలేదని స్పష్టం
- భారతీ సిమెంట్స్‌పై ప్రస్తావన తెచ్చి గత ప్రభుత్వంపై ఎదురుదాడి
- హైందవ ధర్మంపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు పూర్తి మద్దతు

2

ఆంధ్రప్రదేశ్, నవతరం

అసెంబ్లీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై లఘు చర్చ జరిగింది. తమ కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్ ఫుడ్స్‌పై వస్తున్న ఆరోపణలను ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారంలో హెరిటేజ్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకు దురుద్దేశపూర్వకంగా కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, సభలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవాలను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు




## వెయ్యి కోట్లు ఎక్కడ్నించి తెచ్చావు?

- ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్ ను పరామర్శించిన కేటీఆర్
- గాంధీ కుటుంబానికి వేల కోట్లు పంపుతున్నారని రేవంత్ సర్కార్‌పై ఆరోపణ
- ఆ వెయ్యి కోట్లు నీ అయ్యా సొమ్మా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించిన వైనం
- రైతు బంధు, రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శ
- పాలనను వదిలేసి దోపిడీకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ధ్వజం
- అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని నిలదీత



తెలంగాణ, నవతరం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పాలనను పూర్తిగా గాలికొదిలేసి, దోపిడీయే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తోందని, తెలంగాణ ప్రజల సొమ్మును ఢిల్లీలోని గాంధీ కుటుంబానికి

2

## వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలి

- వైసీపీ చేసిన తప్పులను వైఎస్సార్ కు ఆపాదిస్తున్నారని షర్మిల మండిపాటు
- ఏడు కొండలు వెంకన్నవే అని జీవో ఇచ్చింది వైఎస్సారే అని వ్యాఖ్య
- వైసీపీలో వైఎస్సార్ లేరన్న షర్మిల




ఆంధ్రప్రదేశ్, నవతరం

ఏపీ అసెంబ్లీలో తిరుమల లడ్డూ కల్తీపై జరుగుతున్న చర్చ ఇప్పుడు వైఎస్ కుటుంబాన్ని రచ్చకీడ్చమే కాకుండా, రాజకీయంగా కొత్త మలుపులు తిరుగుతోంది. వైసీపీ చేసిన తప్పులను తన తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఆపాదించడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు' కూటమి ప్రభుత్వ

2

## నన్ను క్రిస్టియన్ అంటారా?

**కూటమి ప్రభుత్వ పెద్దలపై భూమన ఎదురుదాడి**

- తన కుమార్తె వివాహం తిరుచానూరులో హిందూ సంప్రదాయ ప్రకారమే జరిగిందని స్పష్టీకరణ
- బైబిల్ పట్టుకున్న చంద్రబాబు, ముస్లిం వేషంలో లోకేశ్ ఫోటోలను ప్రస్తావించిన భూమన
- పవన్ కల్యాణ్ భార్య క్రిస్టియన్ కాదా అని ప్రశ్నిస్తూ, తనపై విమర్శలను తిప్పికొట్టిన వైనం
- టీటీడీలో కల్తీ నెయ్యి ఆరోపణలను ఖండన, నిబంధనలు కఠినతరం చేశానని వెల్లడి

ఆంధ్రప్రదేశ్, నవతరం

వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను క్రిస్టియన్ అంటూ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొడుతూ, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల మత విశ్వాసాలపై సూటి ప్రశ్నలు సంధించారు. ఫోటోలను సాక్ష్యాలుగా

2



# రికార్డుల నుంచి తొలగించాలి



తీరు ఉందని ఎద్దేవా చేస్తూ, అసెంబ్లీ రికార్డుల నుంచి వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ హయాంలో ఏడు కొండలను రెండు కొండలు చేయాలని చూశారన్న విమర్శలను షర్మిల గట్టిగా తిప్పికొట్టారు. "జరిగిందంతా తప్పుడు ప్రచారమే. నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబే బురద చల్లారు. వాస్తవానికి ఏడు కొండలు వెంకన్నవేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చి చరిత్ర సృష్టించింది వైఎస్సార్" అని ఆమె గుర్తు చేశారు. తిరుమల క్షేత్రంలో అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవడానికి జీవో 746, 747లను తీసుకొచ్చి కఠిన నిబంధనలు అమలు చేసిన ఘనత తన తండ్రిదేనని, లడ్డూకు 2009లో అంతర్జాతీయంగా పేటెంట్ రైట్స్ సాధించింది కూడా ఆయనేనని స్పష్టం చేశారు. వైసీపీ పాలనను, వైఎస్సార్ సంక్షేమ పాలనను ఒకటిగా చూడవద్దని షర్మిల హితవు పలికారు. "వైసీపీ పాలన దోచుకుతినే పాలన అయితే, వైఎస్సార్ పాలన పేదల సంక్షేమ పాలన. వైసీపీలో అసలు వైఎస్సార్ లేనే లేదు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజశేఖర్ రెడ్డి ముమ్మాటికీ కాంగ్రెస్ మనిషి అని, కడవరకు కాంగ్రెస్‌లోనే బతికిన ఆయనను వ్యక్తిగతంగా దూషించడం చంద్రబాబుకు భావ్యం కాదన్నారు. వేద పండితుల కోసం 'ఆయుష్మాన్ భవ', దళితుల కోసం 'దళిత గోవిందం' వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న మహానేతను దేవుడిగా కొలుస్తారని అన్నారు.

# బొత్స వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం



కిందకే వస్తాయని, వాటిని తక్షణమే సభా రికార్డుల నుంచి తొలగించాలని ఛైర్మన్‌ను డిమాండ్ చేశారు. వాస్తవాలు వినే ఓపిక లేక వాకౌట్ చేయడం ప్రతిపక్ష నేత బొత్సకు ఫ్యాషన్ గానే కాకుండా, ప్యాషన్‌గానూ మారిందని ఆయన ఎద్దేవా చేశారు. మంగళవారం నాడు శాసనమండలిలో శాంతిభద్రతల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ వాడివేడిగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. చిలకలూరిపేటలో జరిగిన ప్రధాని సభను సరిగా నిర్వహించలేకపోయారని, భద్రతా వైఫల్యం కారణంగానే అప్పటి ఎస్పీపై బదిలీ వేటు పడిందని గుర్తుచేశారు. సోము వీర్రాజు వ్యాఖ్యలపై వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం తెలిపారు. సోము వీర్రాజు ఎవరో ఒకరిని మెప్పించడానికి, భజన చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కూటమి పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శిస్తూ, చర్చలో ప్రధాని ప్రస్తావన తీసుకురావడాన్ని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. దీనిపై హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు అబద్ధాలు చెప్పి వాకౌట్ చేస్తారని విమర్శించారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ బొత్స తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "బొత్స వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరం. మేం ఇక్కడికి సభ్యులను మెప్పించడానికి రాలేదు. ఆ రోజు ప్రధాని సభలో మేమంతా ఉన్నాం. ఎంత ఇబ్బంది పడ్డామో మాకు తెలుసు. కనీస భద్రత కల్పించలేదు, బ్యారికేడ్లు విరిగిపోయాయి. ప్రధాని మాట్లాడుతుండగా మైక్ కూడా కట్ అయింది. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నోటీసు ఇచ్చి అధికారులను సస్పెండ్ చేసిన విషయం బొత్స తెలుసుకోవాలి" అని లోకేశ్ అన్నారు. "శాంతిభద్రతలపై చర్చ జరుగుతుంటే వాకౌట్ ఎందుకు? వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత మాపై, వినాల్సిన బాధ్యత వారిపై లేదా? మధ్యాహ్నం రెండు కాగానే వారికి ఆకలేస్తుంది, వాకౌట్ అని బయటకు వెళతారు. సోము వీర్రాజుపై బొత్స వ్యక్తిగత దాడికి దిగారు. ఇది ఏమాత్రం సరికాదు. ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి" అని లోకేశ్ మండలి ఛైర్మన్‌ను కోరారు. దీంతో సభలో కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

## హెరిటేజ్‌పై ఆరోపణలు



మాట్లాడుతూ, "హెరిటేజ్ సంస్థ మా కుటుంబ వ్యాపారం. ప్రభుత్వ సహకారం లేకుండా నీతి, నిజాయతీతో నిలబడింది. ఇప్పటివరకు హెరిటేజ్ నుంచి ఒక్క కేజీ నెయ్యిని కూడా ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేయలేదు. అయినా వారి పత్రికలో మా సంస్థపై వ్యతిరేక కథనాలు రాశారు. రోజూ 20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తూ నిజాయతీగా వ్యాపారం చేస్తున్నాం" అని స్పష్టం చేశారు. నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ డెయిరీకి ముడిపెట్టే ప్రయత్నాన్ని ఆయన తప్పుబట్టారు. వివాదానికి కేంద్రంగా ఉన్న పూణేలోని ఇందాపూర్ డెయిరీ గురించి సీఎం వివరణ ఇచ్చారు. "ఇందాపూర్ డెయిరీ అనేది ఒక ప్రసిద్ధ కో-మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ. అది కేవలం హెరిటేజ్‌కు మాత్రమే కాకుండా మదర్ డెయిరీ, బ్రిటానియా, పతంజలి, డిమార్ట్, రిలయన్స్, దొడ్ల, అమూల్ వంటి అనేక పెద్ద కంపెనీలకు ఉత్పత్తులను తయారు చేసి సరఫరా చేస్తోంది. అలాంటి సంస్థపై ఆరోపణలు చేస్తూ, దానికి హెరిటేజ్‌ను ముడిపెట్టడం దురదృష్టకరం" అని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "భారతీ సిమెంట్స్‌ను ప్రభుత్వ హౌసింగ్ పథకాలు, ఇతర ప్రాజెక్టులలో వినియోగించారు కదా?" అని ప్రశ్నించారు. నేరస్తులు ఏ విధంగా ఇతరులను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తారనడానికి ఇదే పెద్ద ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. రాజమండ్రిలో పాల కల్తీ ఘటనపై చర్చ జరగకుండా మండలిని అడ్డుకున్నారని గుర్తుచేశారు. "తప్పు చేసిన వాళ్లే ఇప్పుడు మమ్మల్ని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గత పాలకులు చేసిన తప్పులను ముందు ఒప్పుకోవాలి" అని హితవు పలికారు. దేవాలయాల పవిత్రతను దెబ్బతీయవద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. హైందవ ధర్మంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని చంద్రబాబు ప్రకటించారు. ఏ మతానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే అధికారం ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కల్తీ ఘటనలపై చర్చించి కఠిన చర్యలు తీసుకుంటుందని, హెరిటేజ్ వంటి సంస్థలు ఎప్పుడూ తప్పుడు పనులు చేయవని భరోసా ఇచ్చారు.

# కొత్త జిల్లాలో తొలిసారిగా






మధ్యాహ్నం 12 గంటలకు అమరావతి నుంచి బయలుదేరుతారు. 12:40 గంటలకు మార్కాపురం జిల్లా గంటావానిపాలెం చేరుకుని, 12:50 గంటలకు వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2:10 గంటలకు మార్కాపురం పట్టణానికి చేరుకుంటారు. 2:30 గంటలకు తర్లుపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన 'ప్రజావేదిక' బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం 5:20 గంటలకు తిరిగి అమరావతికి పయనమవుతారు. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలనేది ఆ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, టీడీపీ ప్రభుత్వం జనవరిలో మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. మరోవైపు, గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టులో కీలకమైన కెనాల్స్, ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్, జంట సొరంగాల పనులు పూర్తి చేయకుండా, నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్లు ప్రకటించింది. ఐఈ నేపథ్యంలో, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని ప్రస్తుత ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగానే ఫీడర్ కెనాల్ పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనతో జిల్లా అభివృద్ధి, ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వనుందని స్థానికులు ఆశిస్తున్నారు.

# నన్ను క్రిస్టియన్ అంటారా?




చూపుతూ విమర్శనాస్త్రాలు సంధించారు. తన కుమార్తె వివాహం క్రైస్తవ మతం ప్రకారం జరిగిందని ఆరోపించడంపై భూమన తీవ్రంగా స్పందించారు. "నా కుమార్తె వివాహం తిరుచానూరు అమ్మవారి ఆశీస్సులతో 30 వేల మంది అతిథుల సమక్షంలో జరిగింది. ఆ పెళ్లికి మీ వియ్యంకుడు, నాకు ఆత్మీయుడైన బాలకృష్ణ, మీ తమ్ముడు, నా మిత్రుడైన నారా రామ్మూర్తి నాయుడు, 13 మంది హైకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. దేవదేవుని సాక్షిగా వేద మంత్రోచ్చారణల మధ్య హిందూ సంప్రదాయం ప్రకారమే పెళ్లి చేశానని ప్రమాణం చేస్తున్నా. శాసనసభలో నా ఫోటోను ప్రదర్శించి నన్ను క్రిస్టియన్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఇది పచ్చి అబద్ధం" అంటూ చంద్రబాబుపై భూమన ధ్వజమెత్తారు. ఈ క్రమంలో చంద్రబాబు, లోకేశ్, పవన్‌లను లక్ష్యంగా చేసుకుని భూమన ఎదురుదాడికి దిగారు. "బైబిల్ పట్టుకుని ఉన్న ఫోటోలు మీవి కోకొల్లలుగా ఉన్నాయి. మరి మిమ్మల్ని క్రిస్టియన్ అనాలా? మీ కుమారుడు లోకేశ్ ముస్లిం వేషధారణలో వంగి వంగి దండాలు పెడుతున్న ఫోటోలు ఉన్నాయి. మరి లోకేశ్ ను ముస్లిం అనాలా? 'లోకేశ్ సలాం భాయ్' అనాలా? క్రిస్టియన్ యువతులతో లోకేశ్ తిరుగుతున్న ఫోటోలు చూపి ఆయన్ను క్రిస్టియన్ అనాలా?" అని భూమన ప్రశ్నించారు. అలాగే, "పవన్ కల్యాణ్ మూడో భార్య క్రిస్టియన్ కాదా? సనాతన ధర్మ పరిరక్షకుడినని చెప్పుకునే పవన్‌ను ఎందుకు క్రిస్టియన్ అనరు?" అని నిలదీశారు. టీటీడీలో కల్తీ నెయ్యి వివాదంపై కూడా భూమన స్పందించారు. చంద్రబాబు హయాంలోనే కల్తీ నెయ్యికి మూలాలు పడ్డాయని ఆరోపించారు. తాను టీటీడీ ఛైర్మన్‌గా నిబంధనల్ని సడలించలేదని, పైగా కఠినతరం చేశానని స్పష్టం చేశారు. "నా హయాంలో నిబంధనలు కఠినతరం చేశాకే ఏఆర్ డైరీ వంటి సంస్థలు వచ్చాయి. నిబంధనలు సులభతరం చేయడం వల్ల ఒక్క డైరీ సంస్థ అయినా ప్రయోజనం పొందిందని నిరూపించగలరా?" అని చంద్రబాబుకు సవాల్ విసిరారు. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో భాగంగానే కొన్ని మార్పులు జరిగాయని వివరించారు. తన హయాంలో జరిగినంత హైందవ ధర్మ ప్రచారం ఏ ఒక్కరి పాలనలో జరగలేదని, ఈ విషయంపై చర్చకు సిద్ధమని భూమన సవాల్ విసిరారు.

# డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ

46 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో ఉన్న మల్లా రాజిరెడ్డి వంటి సీనియర్లు జనజీవన స్రవంతిలోకి రావడం ఉద్యమాన్ని తీవ్రంగా బలహీనపరిచిందని డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకంలో భాగంగా దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున రివార్డు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇంకా 11 మంది తెలంగాణకు చెందిన మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని, వారు కూడా లొంగిపోవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు (గణపతి) అడవుల్లో లేరని, బయట ఎక్కడో ఆశ్రయం పొందుతున్నారని డీజీపీ పేర్కొన్నారు.

**రాజకీయ జీవితం కొనసాగిస్తా: దేవ్ జీ**

ఈ సందర్భంగా మావోయిస్టు నేత దేవ్ జీ మాట్లాడుతూ, అనారోగ్య కారణాల రీత్యా తాను రహస్య జీవితాన్ని వదిలి బహిరంగ జీవితంలోకి రావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే, ఇది కేవలం వ్యక్తిగత జీవితం కోసం కాదని, ప్రజల సమస్యలపై చట్టబద్ధమైన పద్ధతుల్లో (లీగల్ ఫ్రేమ్‌వర్క్‌లో) పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. "దశాబ్దాల తరబడి నేను నమ్మిన సిద్ధాంతం గైడెన్స్‌గా ఇకపై రాజకీయ జీవితాన్ని కొనసాగించాలనుకుంటున్నాను" అని ఆయన అన్నారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన నేరుగా



సమాధానం ఇవ్వలేదు. తొందరపడి మాట్లాడితే అపార్థాలకు, అనవసరపు చర్చలకు దారితీస్తుందని, తన భవిష్యత్ రాజకీయ జీవితానికి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే ప్రస్తుతం అన్ని విషయాలు పంచుకోలేకపోతున్నానని వివరించారు. త్వరలోనే ఇంటర్వ్యూల రూపంలో అన్ని ప్రశ్నలకు వివరంగా సమాధానమిస్తానని హామీ ఇచ్చారు. ఈ పరిణామం తెలంగాణలో మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వెయ్యి కోట్లు ఎక్కడ్నించి తెచ్చావు?

తరలిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పరామర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా సమస్యలపై కాకుండా, రేవంత్ రెడ్డి గాంధీ కుటుంబానికి సమర్పించుకుంటున్న వేల కోట్ల రూపాయల గురించే చర్చ జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. రెండేళ్ల కాలంలోనే ఢిల్లీకి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వద్ద వెయ్యి కోట్లు సిద్ధంగా ఉన్నాయంటే, రాష్ట్ర ప్రజల సొమ్మును ఇంకెన్ని వేల కోట్లు మింగేశారో అర్థం చేసుకోవాలని అన్నారు. "ఆ వెయ్యి కోట్లు నీ అయ్యా సొమ్మా? లేక నీ అబ్బ సొమ్మా? ఎక్కడి నుంచి తెచ్చావు?" అని ముఖ్యమంత్రిని ఉద్దేశించి కేటీఆర్ ఘాటుగా ప్రశ్నించారు. ప్రజల కష్టార్జితాన్ని దోచుకుని గాంధీ కుటుం బానికి కప్పం కడతారా అంటూ మండిపడ్డారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రె స్ ప్రభుత్వం పూర్తిగా అగాధంలోకి నెట్టిందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో డిసెంబర్‌లోనే రైతుల ఖాతాల్లో చేరే రైతుబంధు నిధులు , మార్చి నెల వచ్చినా ఇప్పటికీ అందించలేకపోయారని ఎద్దేవా చేశారు . రైతుబంధు ఇచ్చే తెలివి, రుణ మాఫీ చేసే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వా నికి లేవని దుయ్యబట్టారు. కనీసం రైతులు పండిం చిన జొన్న, పత్తి పంటలను కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన చరిత్ర రేవంత్ రెడ్డిదని గుర్తుచేశారు. ముఖ్య మంత్రి ఇంత బాహాటంగా అవినీతికి పాల్పడు తుంటే ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఏం చేస్తున్నాయని ఆయన నిలదీశారు.

# ఎలక్ట్రికల్ బస్సుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎన్ఎంయూఏ నిరసన



**రావులపాలెం, ఫిబ్రవరి 24, నవతరం :** ఏపీఎస్ ఆర్టీసీ లో ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ ఆధ్వర్యంలో కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రావులపాలెం డిపోలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు డిపోకు చెందిన ఎన్ఎంయూఏ సభ్యులు మంగళవారం మొదటి డ్యూటీ నుంచే రెడ్ బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం భోజన విరామ సమయంలో డిపో ప్రధాన గేటు వద్ద గేట్ మీటింగ్ ఏర్పాటు చేసి, ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ప్రైవేటీకరణ చర్యలు కార్మికుల హక్కులకు విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఏ.ఎస్. నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. యేసేపు తదితర ఎన్ఎంయూఏ సభ్యులు పాల్గొన్నారు.

# చొప్పెల్ల గ్రామంలో పేకాట గుట్టురట్టు - ఆరుగురిపై కేసు నమోదు, రూ. 2,410 స్వాధీనం



**(నవతరం- ఆలమూరు)** బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా,కొత్తపేట నియోజక వర్గం ఆలమూరు మండలం, చొప్పెల్ల గ్రామంలో పేకాట జరుగుతోందనే పక్కా సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ పరిధిలో జరిగింది.రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణలో, ఆలమూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జి. నరేష్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దాడి చేపట్టారు. గోప్య సమాచారంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం అక్కడికి చేరుకున్న పోలీసులు, పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,410 నగదును స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై 9(1) ఏపీజీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు సమాజంలో చెడు ప్రభావం చూపుతాయని, గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని వారు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని, ఎవరైనా పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# పునర్విక వైద్యం కోసం విరాళాలు ....



**గోకవరం నవతరం న్యూస్ ఫిబ్రవరి:24** మాజీ జెడ్పిటిసి పాలూరి బోసు బాబు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్ మరియు యువతీ యువకులు కలిసి వారి ఆధ్వర్యంలో పునర్వికకు వైద్య సహాయం నిమిత్తం విరాళాలు వసూలు చేశారు నిన్నటి రోజున గోకవరంలో 26 వేల రూపాయలు విరాళాలు రూపంలో వసూలు చెయ్యగా సదరు గోకవరం మండల ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో మంగళవారం వారిచ్చిన ఆర్థిక సహాయంతో కలిపి మొత్తం 30 వేల రూపాయలు గోకవరం తాసిల్దార్ రామకృష్ణ చేతుల మీదగా పునర్వికకు చేరేలా అప్పగించడం జరిగిందని మాజీ జెడ్పిటిసి పాలూరి బోసు బాబు టిడిపి మండలం ప్రధాన కార్యదర్శి గునిపే భరత్ అన్నారు.

# రాజోలు డీసీసీబీ బ్రాంచ్ వద్ద సహకార సంఘ ఉద్యోగుల ఆందోళన



**(నవతరం-రాజోలు)** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల 9వ రోజు ఆందోళన కార్యక్రమంలో భాగంగా రాజోలు సబ్ డివిజన్ పరిధిలో మామిడి కుదురు, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం బ్రాంచీల పరిధిలో గల సొసైటీ సీఈఓ లు మరియు సిబ్బంది రాజోలు బ్రాంచ్ వద్ద సమ్మెలో పాల్గొన్నారు. వారికి పలు సంఘాల చైర్మన్లు, డైరెక్టర్స్ సమ్మెకు సంఘీభావం తెలియపరచియున్నారు.కసుకుర్తి త్రినాధ స్వామి, పిప్పళ్ళ రాము (రాంబాబు),ఆకుల సత్యనారాయణ సంఘ నాయకులు లీలా కృష్ణ, భాస్కర రావు, రాఘవేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# క్రియాశీలక సభ్యత్వ నమోదు 2026 సన్నాహక సమావేశం

## తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో పరిణయ ఫంక్షన్ హాల్ లో మీటింగ్ విజయవంతం





**కాకినాడ జిల్లా జగ్గంపేట నవతరం న్యూస్ ఫిబ్రవరి 22:** జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జగ్గంపేట పరిణయ ఫంక్షన్ హాల్ లో క్రియాశీలక సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల జనసైనికులు జనసేన నాయకులు హాజరయ్యారు. అలాగే పవన్ కళ్యాణ్ గారు నూతనంగా ఉద్యమి సాధక్ ప్రదాత పేర్లతో పార్టీకి మూడంచల వ్యవస్థ పరిచయం చేయడంతో వాటి యొక్క విశిష్టతను ఈ కార్యక్రమంలో నాయకులతో రమేష్ చర్చించారు. ఆలాగే క్రియాశీలక సభ్యత్వాలు చేయడానికి ఉత్సాహం గా తమ పేర్లను న నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మరియు జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు పార్టీ కార్యకర్తల క్షేమం కోసం క్రియాశీలక సభ్యత్వం తీసుకొచ్చి వారికి వారి కుటుంబానికి భద్రతను తీసుకొచ్చారని, కార్యకర్తల కోసం ఆలోచించే ఏకైక పార్టీ జనసేన పార్టీ అని, జగ్గంపేట నియోజకవర్గంలో గత క్రియాశీలక సభ్యత్వాలు 13000 పైచిలుకు సభ్యత్వాలు చేసి జగ్గంపేటలో జనసేన బలం నిరూపించామని,జనసైనికులు నాయకులు బాగా కష్టపడి జనసేన పార్టీ కార్యకర్తలు కి క్రియాశీలక సభ్యత్వం విశిష్టతను తెలియజేసి ఈ 2026వ సంవత్సరంలో 20000 పైచిలుకు సభత్వాలు నమోదు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ కార్యకర్తలకు ఎటువంటి ప్రభుత్వ పనులు చేయడం లేదు అని రమేష్ గారి తో అనడం తో కూటమి లో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని జనసైనికుల ఇబ్బందుల ను ఎమ్మెల్యే నెహ్రూ గారి దృష్టి కి, కాకినాడ ఎంపీ ఉదయ్ గారి దృష్టిలో ఉంచి జనసైనికులు కు న్యాయం చేస్తామని తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి , సర్పంచ్ లు,ఎంపీటీసీ లు జగ్గంపేట నియోజకవర్గం ఐటీ కోఆర్డినేటర్,మండలం అధ్యక్షులులు, గ్రామ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యత్వ వాలంటీర్లు జన సైనికులు నాయకులు భారీ స్థాయిలో హాజరయ్యారు.

# కల్తీ పాలు ఘటనపై జిల్లా యంత్రాంగం స్పందన అభినందనీయం





**(నవతరం- రాజమహేంద్రవరం)** కల్తీ పాలు సేవించి అనారోగ్యం పాలైన సంఘటనపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మరియు జిల్లా అధికారుల తక్షణ స్పందన అభినందనీయమని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక కిమ్స్ , రెయిన్బో , ఆదిత్య ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. ఎంపీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్లి, అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, కల్తీ పాలు సేవించి 15 మంది అనారోగ్యం పాలవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో నలుగురు మరణించగా, మిగిలిన 11 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వీరిలో ఇద్దరు చిన్నారులు ఉండటం మరింత విషాదకరమన్నారు. బాధితులకు అవసరమైన మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వారి చికిత్స ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా భరిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ అనే పాల వ్యాపారి వద్ద పాల శీతలీకరణ యంత్రం నుంచి ఇథిలిన్ గ్లైకోల్ అనే రసాయనం లీక్ కావడం వల్లే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణలో వెల్లడైందన్నారు. ఈ రసాయనం ప్రభావం ముఖ్యంగా 60 ఏళ్లు పైబడినవారికి, ఐదేళ్ల లోపు పిల్లలకు, అలాగే అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారికి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే జిల్లా యంత్రాంగం ఆయా ప్రాంతాలకు చేరుకుని బాధితులను ఆసుపత్రులకు తరలించడం, రక్త నమూనాలు సేకరించడం, 42 మంది రైతుల నుంచి పాల నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు పంపించడం వంటి చర్యలను ఆమె ప్రశంసించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నగరంలోని పాల శీతలీకరణ యంత్రాల పనితీరుపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అలాగే పాడి పశువులకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం బాధ్యత తీసుకుని బాధితుల వైద్య ఖర్చును పూర్తిగా భరిస్తోందన్నారు. అధికారులతో పాటు కూటమి నాయకులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, పాలు వినియోగించిన 293 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా, ఇప్పటివరకు 241 మందికి వచ్చిన నివేదికలు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. మూల కారణాలను గుర్తించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సంబంధిత వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలోని ఇతర డెయిరీలపై నిరంతర నిఘా, తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే పాలు, ఇతర ఆహార పదార్థాల కల్తీపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు చేయడంతో పాటు, పూర్తిస్థాయి ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించినట్లు తెలిపారు.







# సైబర్ నేరాలు పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి.

**(నవతరం-మండపేట)** యువత ముఖ్యంగా మత్తు పదార్థాలకు బానిస కావద్దని మండపేట టౌన్ సి ఐ సురేష్ అన్నారు. మండపేట భాష్యం స్కూల్ లో మంగళవారం సి ఐ సురేష్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో రేపటి తరం కోసం గంజాయి రహిత సమాజం ఇదే మా సంకల్పం పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, గుట్కా, సిగరెట్, డ్రగ్స్ వంటివి హాని చేస్తాయని వివరించారు. జీవితం నాశనం అవుతుందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వీటి జోలికి పోవద్దని సూచించారు. ఇటీవల సైబర్ క్రైమ్ విపరీతంగా పెరిగిందని యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. పోక్సో చట్టం ను వివరిస్తూ బాలికలు, మహిళలు పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టాలు కఠినంగా ఉన్నాయని తెలిపారు. మహిళల ను గౌరవించాలని వారికి కష్టం నష్టం కలిగే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# కల్తీ పాల ఘటన మృతుల కుటుంబాలకు పరిహారం పంపిణీ





- వైద్య ఖర్చులు పూర్తిగా ప్రభుత్వం భరిస్తుంది
- వైద్య సేవలు అందించే క్రమంలో లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ చేయనున్నాం
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి
- రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్...

( నవతరం- రాజమహేంద్రవరం) పాల కల్తీ ఘటన కు చెందిన బాధిత వ్యక్తులు కు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు. మంగళవారం స్థానిక శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ లతో కలిసి సి ఎం ఆర్ ఎఫ్ పరిహార చెక్కులను చౌడేశ్వర నగర్ కు చెందిన శేషగిరి రావు (72 పురుషుడు), గాంధీపురం కు చెందిన తాడి రమణి (58) తాడి శకుంతల (76) చెరో 10 లక్షల చొప్పున అందచేయడం జరిగింది. అంతకు ముందు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా మంచి రాధాకృష్ణ మూర్తి ,(74 ఏళ్లు ) అంద చేసినట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ.. కల్తీ పాల ఘటనలో మృతి చెందిన నలుగురు కుటుంబాలకు గౌరవ ముఖ్యమంత్రివర్యులు ప్రకటించిన ఎక్స్ గ్రేషియాను అందజేసినట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న 15 మంది ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామన్నారు. వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. పాలు సేవించిన 110 కుటుంబాలలో 315 మందికి పరీక్షలు నిర్వహించగా.. అస్వస్థతకు గురైన మరో ఇద్దరిని ఆస్పత్రిలో చేర్చినట్లు వెల్లడించారు. వైద్య నిపుణులు చెప్పిన ప్రకారం మరో రెండు వారాల పాటు ఈ మెడికల్ క్యాంపులు కొనసాగుతాయని తెలియజేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాల కల్తీ ఘటనలో మృతి చెందిన నలుగురి కుటుంబసభ్యులకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్ గ్రేషియాను అందజేయటం జరిగిందన్నారు. అలాగే చికిత్స పొందుతున్న 15 మంది వైద్యానికి అయ్యే ఖర్చును కూడా ప్రభుత్వమే పూర్తిగా భరిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు ప్రకటించిన విధంగా బాధితులు అప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం కూడా రియంబర్స్ చేయటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరిని సంప్రదిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కనుక దుష్ప్రచారాలు మానుకోవాలని ప్రతిపక్ష నాయకులకు సూచించారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ.. ఈ నెల 16, 17, 18 తేదీలలో కల్తీ పాలు సేవించిన దాదాపు 315 మందికి టెస్టులు చేయటం జరిగిందన్నారు. మరో వారం రోజుల పాటు మెడికల్ క్యాంపుల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వారిపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా జిల్లాలోని మిగిలిన డైరీలలోనూ తనిఖీలు నిర్వహించి.. నిరంతర పర్యవేక్షణ చేపడతామని స్పష్టం చేశారు.











## శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



( నవతరం-అమలాపురం) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మంగళవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అధికారులతో మాసిక క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఎస్.డి.పి.ఓలు, సి.ఐలు మరియు ఎస్.ఐలతో కలిసి నేరాల అదుపు, పెండింగ్ కేసులు మరియు సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ యొక్క సమీక్షలో సి.సి.టి.ఎన్.ఎస్. క్రైమ్ మరియు క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ మరియు సిస్టమ్స్ డేటా ఆధారంగా జిల్లాలో నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతులను ఎస్పీ సమీక్షించారు. ముఖ్యంగా మూడేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

డ్రోన్ వినియోగం, 112 అత్యవసర సేవలు, ఇ-చలానా వసూళ్లు మరియు 'వాట్సాప్ గవర్నెన్స్' ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఇ-సాక్ష్య, సి ఈ ఐ ఆర్ రిపోర్ట్ మరియు మెడ్లీపర్ అప్లికేషన్ల పనితీరుపై దిశానిర్దేశం చేశారు. రాబోయే వారం రోజుల్లో జరగబోయే జాతరలు, పండుగల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కులపరమైన సమస్యలు తలెత్తకుండా సామరస్య కమిటీల ద్వారా శాంతిని నెలకొల్పాలని సూచించారు.రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న వారెంట్లు మరియు అరెస్టులను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మార్చి 14న జరగనున్న లోక్ అదాలత్ కోసం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్పీ కోరారు. రాత్రి సమయాల్లో గస్తీ పెంచాలని మరియు కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువ కావాలని అధికారులకు సూచించారు.






## గ్రామ స్థాయి కమిటీలలో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి: బడుగు మహిమ రావు



(నవతరం- రావులపాలెం ) గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఆరోగ్య, పరిశుభ్రత తదితర కమిటీలలో దివ్యాంగులను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని పారా సంస్థ సిబిఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమ రావు కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ఆయన జిల్లా అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీరాజ్ అధికారి శాంత లక్ష్మీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ డా. ప్రతాప్‌లను కలిసి గ్రామస్థాయిలో దివ్యాంగుల భాగస్వామ్యం పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. దివ్యాంగుల సామాజిక అభివృద్ధి, గౌరవంతో కూడిన జీవనం, ఆత్మస్థైర్యం పెంపు లక్ష్యంగా 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం ఈ కమిటీలలో వారికి ప్రాతినిధ్యం కల్పించడం సమాజంలోని అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. దివ్యాంగులను గ్రామస్థాయి నిర్ణయాలలో భాగం చేస్తే వారి సమస్యలు సమర్థవంతంగా పరిష్కారం అవుతాయని, సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. వినతి పత్రం స్వీకరించిన అధికారులు ఈ అంశంపై సానుకూలంగా స్పందిస్తూ, దానిపై ఎలా ముందుకు వెళ్లాలనే విషయంపై అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## డిప్యూటీ సీఎం ని కలిసిన ఎమ్మెల్యే జోగేశ్వరరావు, లీలాకృష్ణ.



(నవతరం - మండపేట) వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మంగళ వారం శాసన సభ విరామ సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు , రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఉప ముఖ్యమంత్రి కి వివరించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల మెరుగుదల, సాగునీటి సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వేలం పాటలు



(నవతరం- ఆత్రేయపురం ) ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యాలయంలో దేవస్థానానికి సంబంధించిన పలు హక్కుల కోసం బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు, ఈ-టెండర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమం దేవస్థానం ఈవో డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో, ధర్మకర్తల మండలి చైర్మన్ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. పార్కింగ్, బియ్యం, తలనీలాలు, షాపులు, పట్టు కండువాల సరఫరా వంటి అంశాలకు సంబంధించిన టెండర్లను నిర్వహించగా, గ్రూప్ టెంపుల్స్ లక్ష్మీ పోలవరం ఈవో బి. కిరణ్ తనిఖీదారుగా వ్యవహరించారు. ఈ ఏడాది నిర్వహించిన వేలం పాటల ద్వారా దేవస్థానానికి గత సంవత్సరంతో పోలిస్తే గణనీయమైన ఆదాయం పెరిగింది. శ్రీ స్వామివారికి సమర్పించిన బియ్యాన్ని ప్రోగు చేసుకుని తీసుకువెళ్లే హక్కును వాడపల్లి గ్రామానికి చెందిన సఖినాల వెంకటరావు సంవత్సర కాలానికి రూ. 81,63,309కు దక్కించుకున్నారు. గతంలో ఈ హక్కుకు రూ. 51,11,830 మాత్రమే వచ్చినప్పటికీ, ఈసారి రూ. 30,51,479 అధిక ఆదాయం నమోదైంది. అలాగే స్వామివారికి సమర్పించిన తలనీలాలను ప్రోగు చేసుకుని తీసుకువెళ్లే హక్కును ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన యాదగిరి ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన కె. రాజు రూ. 20,07,000కు దక్కించుకున్నారు. గత సంవత్సరం రూ. 7,70,777 వచ్చిన ఈ విభాగంలో ఈసారి రూ. 12,36,223 అధిక ఆదాయం లభించింది. శ్రీ స్వామివారి సేవలు, కళ్యాణోత్సవాల్లో ఉపయోగించే పట్టు కండువాల సరఫరా హక్కును విజయనగరానికి చెందిన శ్రీ విజయకుమార్ వస్త్రాలయం వారు సంవత్సర కాలానికి ఒక్క కండువా రూ. 69 చొప్పున సరఫరా చేయడానికి లోయెస్ట్ టెండర్ దక్కించుకున్నారు. దేవస్థాన అవసరాల కోసం సెక్యూరిటీ సప్లై హక్కును రాజమండ్రికి చెందిన సారిక సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ దక్కించుకుంది. పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేయనున్న 20 షాపులకు బహిరంగ వేలం నిర్వహించగా కేవలం రెండు షాపులకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. పార్కింగ్ టెండర్‌కు సంబంధించి బహిరంగ బాక్స్ టెండర్లలో ఎవరూ పాల్గొనకపోవడంతో ఆ వేలాన్ని వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, గ్రూప్ టెంపుల్స్ లక్ష్మీ పోలవరం ఈవో బి. కిరణ్, ధర్మకర్తల మండలి సభ్యులు మస్కపల్లి త్రిమూర్తులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





Printed by SIRIGIRI VARADARAJU and Published by SIRIGIRI VARADARAJU on behalf of SIRIGIRI VARADARAJU,and Printed at: Kanthi Publications, Door No:2-504/1,Adityanagar colony,Arasavalli, Srikakulam, Andhra Pradesh State,532401, India,Printed and Published and Owned by SIRIGIRI VARADARAJU Door No:18-11-12/1,Krishnanagar, Rajamahendravaram,East Godavari